క్లుప్తంగా

నకిలీ మద్యం అమ్మకాలపై నేడు నిరసన


తానేటి వనిత

దేవరపల్లి: కూటమి ప్రభుత్వ పాలనలో నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజక వర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేవరపల్లిలోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. నిరసన అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల పార్టీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి ఇత్తడి కాటా అందజేత


కోటసత్తెమ్మ ఆలయానికి కాటా అందజేస్తున్న దాతలు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విజయవాడ వాస్తవ్యులు బొగ్గరపు రాంబాబు, అనురాధశ్రీ దంపతుల కుమారులు వెంకట్ ఉదయ్, కైలా స్‌లు రూ.1.20 లక్షల విలువైన ఇత్తడి తులాభారం కాటాను అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,71,119 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధిలో భిక్ష

నల్లజర్ల: అనంతపల్లి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద దీక్షాదారులకు ప్రతినిత్యం భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రత్తి శ్రీనుబాబు, కార్యదర్శి దివి పాండురంగ శర్మ తెలిపారు. అక్టోబరు 3వ తేదీ నుంచి నవంబరు 17 వరకు దాతల సహకారంతో దీక్షా మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ గౌరవ అధ్యక్షుడు బళ్ల ప్రభాకరావు తెలిపారు. అనంతపల్లి, నబీపేట, తిమ్మన్నపాలెం, అచ్చన్నపాలెం, కృష్ణమ్మ గూడెం గ్రామాలకు చెందిన 150 మంది స్వాములకు ఇక్కడ నిత్యం భిక్షా కార్యక్రమం జరుగుతుందన్నారు.

కొత్త గురువులు వచ్చేస్తున్నారు!

నల్లజర్ల: డీఎస్సీలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు అక్టోబరు 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమం ముగిసేలోగా పాఠశాలల ఎంపికకు అవకాశం కల్పించారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలకు 26 మంది, ఉన్నత పాఠశాలలకు 9 మంది ఎంపికైనట్లు సమాచారం. వీరంతా 13వ తేదీ సోమవారం విధుల్లో చేరే విధంగా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత ఉంది. కొత్త ఉపాధ్యాయుల నియామకం పూర్తైతే ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం 75 మంది వాకర్స్‌కు ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పైడి సురేష్ మాట్లాడుతూ, షుగర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి షుగర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, బీఎస్‌వీ ప్రసాద్, మాచర్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మను దర్శించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరంలో ఉన్న గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవి నవరాత్రులు పురస్కరించుకుని భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ, డి.ముప్పవరంలో ఉన్న దుర్గాదేవి అమ్మ వారి ఆలయాల వద్ద భారీ అన్న సమారాధనలు జరిగాయి.

సిరుల ఫ్లవర్

- కాలీఫ్లవర్ సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- నియోజకవర్గంలో 900 ఎకరాల్లో సాగు
- ప్రారంభంలో ధర ఉన్నా అనంతరం పతనం


రావూరుపాడులో తయారవుతున్న కాలీఫ్లవర్


తాళ్లపూడి మండలం రావూరుపాడులో కాలీఫ్లవర్ సాగు

తాళ్లపూడి: సీజనల్ పంటలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా కాలీఫ్లవర్ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కాలీఫ్లవర్ సాగులో పెట్టుబడి వ్యయం పెరిగినప్పటికీ తక్కువ సమయంలో పంట చేతికి రావడంతోపాటు లాభదాయకంగా కూడా ఉండటంతో దీనిని సాగు చేస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో కాలీఫ్లవర్ పంటకు ఇక్కడి నేలలు సాగుకు అనుకూలంగా ఉండటంతో పాటు పంట కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు దాని వైపు మల్లుతున్నారు. తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని రైతులు అంతరపంటగా కూడా కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు. తాళ్లపూడి మండలంలోని రావూరుపాడు, మలకపల్లి, పెద్దేవం, బల్లిపాడు, కొవ్వూరు మండలంలో దొమ్మేరు, పనకనమెట్ట సావరం, కాపవరం, చిడిపి గ్రామాల్లో, చాగల్లు మండలంలో సుమారు 900 ఎకరాల్లో రైతులు కాలీఫ్లవర్ సాగు చేస్తున్నారు. నిడదవోలు, దేవరపల్లి మండలాల్లో 17 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో గత నెల రోజులుగా కాలీఫ్లవర్‌ను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. ఏటా సెప్టెంబర్ రెండో వారం నుంచి కాలీఫ్లవర్ వేస్తారు. ఇది అక్టోబర్ నెలాఖరు నుంచి నవంబర్ నెలలో తయారైన కాలీఫ్లవర్‌కు మార్కెట్‌లో ధర కూడా బాగానే ఉంటుంది. ప్రస్తుతం కాలీఫ్లవర్ పంటలు పెరిగే దశలో ఉన్నాయి.

కాలీఫ్లవర్ సాగు ఇలా..

ఎకరం చేలో కాలీఫ్లవర్‌కు సుమారు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు పెట్టుబడి అవుతుందని రైతులు అంటున్నారు. అదనంగా కౌలు రూ.35 వేల నుంచి రూ.40 వేలు అవుతుంది. 90 రోజుల వ్యవధిలోనే పంట కోతకు వస్తుంది. కాలీఫ్లవర్ సాగు చేయడానికి ఈ ప్రాంతంలో రైతులు ముందుగా పశువుల ఎరువు వేసి దుక్కి దున్ని నేలను సిద్ధం చేస్తారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో స్టార్-9, గోదావరి 86, కార్తీ స్పెషల్, బుల్లెట్, అవతార్‌లతో పాటు ఇతర హైబ్రిడ్ రకాలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఎకరానికి 250 గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. ముందుగా నారుకట్టి 30 రోజుల తరువాత నారును పొలంలో విత్తుకోవాలని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 12 వేల నుంచి 14 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. కాలీఫ్లవర్ మూడు నెలల్లో మొత్తం కాపు పూర్తవుతుందని చెబుతున్నారు.

అంతర పంటగా కూడా..

కాలీఫ్లవర్‌ను అంతర పంటగా వేయడం ద్వారా కొందరు రైతులు అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రధానంగా అరటి, మిరప పంటల్లో దీనిని వేస్తున్నారు. ఏడాది పొడవునా డిమాండ్ ఉండే పచ్చిమిర్చిని రైతులు కాలీఫ్లవర్‌లో అంతర పంటగా వేస్తూ లాభాలతోపాటు అధిక దిగుబడులను కూడా సాధిస్తున్నారు. ముందుగా కాలీఫ్లవర్‌ను వేసి 15 రోజుల వ్యవధిలో కూర మిరపను అంతర పంటగా వేస్తున్నారు. కాలీఫ్లవర్ అయిన తరువాత మిరప వేస్తే మరింత సమయం పడుతుందని, అదే పంట ఉండగానే వేస్తే కాలీఫ్లవర్ పూర్తయ్యే సమయానికి మిరప చేను కాపు ప్రారంభం అవుతుందని రైతులు అంటున్నారు. మిరపలో అంతరపంటగా కాలీఫ్లవర్ సాగు చేయడం ద్వారా దాని కోసం ఉపయోగించిన ఎరువులు, పురుగుమందులు మిరప పంటకు ఉపయోగపడటంతో ఖర్చులు తగ్గుతాయన్నారు. కాలీఫ్లవర్ వల్ల వచ్చే ఆదాయం కొంత రైతుకు లాభాలను చేకూరుస్తుంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ఉభయగోదావరి జిల్లాలోని అన్ని ప్రధాన కూరగాయల మార్కెట్లతోపాటు రాజమహేంద్రవరం, వైజాగ్, చెన్నైకు ఇక్కడ నుంచి రైతులు ఎగుమతి చేస్తున్నారు. ఇప్పుడే మార్కెట్లోకి కాలీఫ్లవర్ వస్తుంది. వాతావరణంలో మార్పులు కారణంగా సస్యరక్షణ చర్యలకు కూడా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ఫిబ్రవరి, మార్చి వరకు కాలీఫ్లవర్ తోటలు ముమ్మరంగా ఉంటాయి. గతంలో కంటే పెట్టుబడి ఖర్చులు పెరిగాయని రైతులు చెబుతున్నారు. అదే సమయంలో మార్కెట్లో ధర ఎన్ని రోజులు ఉంటుందో చెప్పలేమని రైతులు అంటున్నారు. మొదట్లో రూ.15 నుంచి రూ.10 ఉన్న ధర తరువాత కాలీఫ్లవర్ ఒక్కోటి రూ.5 నుంచి రూ.6 వరకు ధర పతనమైన సంఘటనలు కూడా ఉన్నాయి.

సాగుకు ఇక్కడి నేల అనుకూలం



ఈ ప్రాంతంలోని నేల కాలీఫ్లవర్ సాగుకు అనుకూలంగా ఉంటాయి. తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, చాగల్లు మండలాల్లో ఎక్కువగా వీటిని రైతులు సాగు చేస్తున్నారు. కాలీఫ్లవర్ ఎకరానికి 250 గ్రాముల విత్తనం సరిపోతుంది. ముందుగా నారుకట్టిన 25 రోజుల తరువాత నారును విత్తుకోవాలి. అధికారుల సూచనలు మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వేయాలి. అధికంగా పురుగు మందులు పిచికారీ చేయరాదు. పెట్టుబడులు పెరగకుండా చూసుకోవాలి.

– డి.సుధీర్ కుమార్, హార్టికల్చర్ ఏడీ, కొవ్వూరు.

మానవత సంస్థకు రూ.లక్ష విరాళం


మానవత సేవా సంస్థకు విరాళం అందజేస్తున్న హనుమంతరావు దంపతులు

దేవరపల్లి: మండలంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాతలు తమ వంతు ఆర్థిక సాయం అందిస్తున్నారు. దేవరపల్లి మండలం సంగాయగూడెంకు చెందిన అబ్బిన హనమంతరావు దంపతులు రూ.50 వేలు సంస్థకు విరాళంగా అందజేశారు. విరాళాన్ని సంస్థ జిల్లా ప్రతినిధి బళ్ల సూర్యచంద్రానికి ఆదివారం అందజేశారు. హనుమంతరావు తండ్రి సుబ్బారావు, నాయనమ్మ రామమ్మ జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్టు ఆయన తెలిపారు. చిన్నాయగూడెంకు చెందిన విల్లూరి రాఘవేంద్రరావు జ్ఞాపకార్థం భార్య సుజాత సంస్థకు రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ


సాధించిన పతకంతో తపస్విరెడ్డి

నిడదవోలు: పట్టణానికి చెందిన కుంచాల తపస్వి రెడ్డి కరాటేలో ప్రతిభ కనబరిచాడు. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలతో ఆదివారం జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్-2025లో బ్లాక్ బెల్ట్ ఓపెన్ కేటగిరీలో కరాటే విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఏపీ సేకో షాటో కాన్ కరాటే టూ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్విరెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.

చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ ఆందోళనలు

దేవరపల్లి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సిర్రా కృష్ణ మాదిగ ఆదివారం రాత్రి తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 13న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం, 17న మండల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన చెప్పారు. నిరసన కార్యక్రమాలు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ధర్మం ముసుగులో ఆధర్మవాదులు చేస్తున్న దాడులను తరిమికొడదామని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కూటమి ధృతరాష్ట్ర పాలన



మార్కొండపాడులోని రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు

మార్కొండపాడులో కోటి సంతకాల కార్యక్రమం

చాగల్లు: చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని మార్కొండపాడులో ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ, రచ్చబండ కార్యక్రమాల్లో భాగంగా కూటమి ప్రభుత్వ మోసాలపై ఆయన మాట్లాడారు. నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వైద్య కళాశాలలను నేడు చంద్రబాబు ప్రైవేటీకరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా కదలాలని ఆయన పిలుపునిచ్చారు.

నాడు ప్రజారోగ్యానికి పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన విషయాన్ని తలారి వెంకట్రావు గుర్తు చేశారు. ఆసుపత్రుల ఆధునికీకరణ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. వైద్య కళాశాలలు వస్తే అనుబంధంగా బోధనాసుపత్రులు వస్తాయని, తద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యం పేద ప్రజలకు అందుతుందని అప్పటి సీఎం వైఎస్ జగన్ భావించి రాష్ట్రవ్యాప్తంగా రూ.8,300 కోట్లతో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. రెండేళ్లలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 7 వైద్య కళాశాలలు పూర్తి చేశారని, 2023-24 ఏడాదిలో 5 కళాశాలల్లో బోధన తరగతులు ప్రారంభించారని వివరించారు. చంద్రబాబు తన బంధువులు, వర్గీయులకు లబ్ధి చేకూర్చేందుకు కళాశాలలను ప్రైవేటీకరించాలని కుట్ర పన్నారని విమర్శించారు. 30 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఎగ్గొట్టారని, మహిళలకు నెలకు రూ.1500 ఆడబిడ్డ పథకం వర్తింపచేస్తామని నిలువునా మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా ఏడుకొండలు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పెదపాటి రమణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కంకిశెట్టి వాసు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కె.కిషోర్, పార్టీ నాయకులు ఉండవల్లి శ్రీనివాస్, గనిశెట్టి చిన్నా, శేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి వనిత పరామర్శ


పోతవరంలో కృష్ణారావును పరామర్శిస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: మండలంలోని పోతవరంలో పలువురిని మాజీ హోంమంత్రి తానేటి వనిత పరామర్శించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త పెనుమాక కృష్ణారావు కిడ్నీ సమస్యతో బాధపడుతుండటంతో ఆదివారం ఆయనను తానేటి వనిత పరామర్శించారు. రిపోర్టులు పరిశీలించి సంబంధిత డాక్టర్లతో ఆమె మాట్లాడారు. అదే గ్రామంలో కాలుకి సర్జరీ చేయించుకొన్న ఏలేటి ఈశ్వరావు, అనారోగ్యంతో ఉన్న పెన్నాడ రాజారత్నం, వెన్నుపూస సంబంధిత సమస్యతో బాధపడుతున్న పెన్నాడ వెంకటరత్నాన్ని ఆమె పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నూతికుర్తి రామకృష్ణ కుమారుడు మల్లేష్, సుభద్రపాలెంలో వెంకరత్నం కుమారుడు వెంకన్న ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. పోతవరంలో అనారోగ్యంతో ఉన్న 16వ వార్డు మెంబరు కలిదిండి శ్రీనును కూడా పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బంక అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీ పాపా నాగేశ్వరావు, సొసైటీ మాజీ చైర్మన్ పెండ్యాల హరే రామకృష్ణ, రైతు సంఘ నాయకులు పెండ్యాల వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల పరిశీలన


కొవ్వూరులోని వసతిగృహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

తాళ్లపూడి (కొవ్వూరు): విద్యాభివృద్ధిలో భాగంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాడపల్లిలోని బీసీ బాలుర వసతిగృహం, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ, విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఎమ్‌జేపీ గురుకుల పాఠశాలల స్థాపన జరుగుతోందని పేర్కొన్నారు. వాడపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతోందా? మెనూ ప్రకారం ఆహారం అందుతుందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రతకు, ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేసే క్రమంలో ప్రతి వసతిగృహం, పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడేందుకు కాయిన్ బాక్స్ ఫోన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న ఈ గురుకుల పాఠశాలకు త్వరలో సొంత భవనం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీవో రాణి సుస్మిత, బీసీ సంక్షేమ అధికారి శశాంక, ప్రిన్సిపల్ ఆనంద్ రాజ్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

సీటీఆర్ఐ: ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, రాయితీలు పొందుతూ నెలకొల్పుతున్న ప్రైవేటు రంగంలోని పరిశ్రమల్లో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విచ్చేసినట్టు తెలిపారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ద్వారా భూములు, బ్యాంకు లోన్లు, ఇతర మౌలిక వసతులు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయడానికి కృషి చేయాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో నిరుద్యోగులు పెరుగుతున్నారని వివరించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం అమ్మకాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఉందుర్తి సుబ్బారావు కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తలారి నాని, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కన్నిపాముల శ్రీనివాస్, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి బొచ్చు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు జడ్జి నర్సరీ సందర్శన


హైకోర్టు జడ్జి మాధవీదేవికి మొక్కను అందిస్తున్న ఆంజనేయులు

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీని ఆదివారం తెలంగాణ హైకోర్టు జడ్జి టి.మాధవీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు మనీ ప్లాంట్ గోల్డ్ మొక్కను అందించి స్వాగతం పలికారు. నర్సరీలో మొక్కలు, వాటి విశిష్టతను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా మాధవీదేవి మాట్లాడుతూ, నర్సరీల అందాలు చూడముచ్చటగా ఉన్నాయన్నారు. మొక్కలపై చూపించే అభిమానం అద్భుతమని ప్రశంసించారు. ఆయుర్వేద మొక్కలపై ఇంకా శ్రద్ధ వహించి వాటిని ఇంకా అభివృద్ధి చేయాలన్నారు. ఆమె వెంట నర్సరీ ప్రతినిధులు పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్, రైతులు ఉన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు


భీమోలు సర్పంచ్ కుమారుడి పెళ్లికి హాజరైన మాజీ హోంమంత్రి తానేటి వనిత

గోపాలపురం: మాజీ హోంమంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తానేటి వనిత ఆదివారం మండలంలోని భీమోలు గ్రామ సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి కుమారుడు సాయి ప్రతాప్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, నాయకులు పఠాన్ అన్సర్ భాషా, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కూసం రామమోహన్‌రెడ్డి, బండారు జగన్‌మోహన్ రావు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్‌సుందర్ అన్నారు. రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 101 మంది రక్తదానాన్ని, 112 మంది లిక్విడ్ లవ్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నారని వివరించారు.

వివాదాస్పదంగా రాగోలపల్లి కొండ ప్రాంతం

- కొనసాగుతున్న ఆక్రమణల వివాదం
- రెండేళ్లుగా పట్టాల కోసం దళితుల ఎదురుచూపులు
- దృష్టి సారించని రెవెన్యూ అధికారులు


రాగోలపల్లిలోని ఆలయాల వద్ద ఉన్న కొండ ప్రాంతం


కొండ చుట్టూ ఏర్పాటు చేసుకున్న ఇళ్లు

తాళ్లపూడి: మండలంలోని రాగోలపల్లిలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద కొండ (మెరక దిబ్బ) భూమి గ్రామంలోని రెండు వర్గాల మధ్య వివాదాస్పదంగా మారింది. గ్రామంలోని 11వ వార్డు సమీపంలో సర్వే నంబర్ 309లో సుమారు 12 ఎకరాలు మెరక దిబ్బ ఉంది. ఇందులో అధిక శాతం భూమి ఆక్రమణలకు గురైంది. కొన్నేళ్లుగా ఆ కొండను సుబ్బారాయుడు మెట్టగా పిలుస్తూ.. ఏటా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠిని నిర్వహించే ప్రదేశంగా ప్రసిద్ధగాంచింది. కొండ దిగువ భాగం చుట్టూ దళితులు గతంలో స్థలాలను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కొండ పోరంబోకు భూమిగా ఉండటంతో ఇటీవల ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గతంలోనే ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్ లోపలే ఆలయ అభివృద్ధి పనులు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఇటీవల పడిపోతున్న గ్రామ దేవత ఆలయ పునర్నిర్మాణం చేయాలన్న తలంపుతో గ్రామస్తులు చేపట్టిన పనులను కొండ చివర ఉన్న కొంతమంది దళితులు వ్యతిరేకిస్తున్నారు. ఈ 12 ఎకరాల భూమిలో అటు కొండపైన ఆలయాలు ఉంటే, కింద వైపు చుట్టూ దళితుల నివాసాలు రెండు ఆక్రమణలోనే ఉన్నాయి. కాగా ఇటీవల రాగోలపల్లికి చెందిన కొంతమంది భూమిని ఆక్రమించి మట్టి తవ్వేస్తున్నారని, మరో కొంత స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని కొవ్వూరు ఆర్డీవోకు గ్రామానికి చెందిన దళితులు ఫిర్యాదు చేశారు. దీనిపై తాళ్లపూడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా తమ గోడు వినిపించుకోలేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు దృష్టికి కూడా తీసుకెళ్లారు. రెండు రోజుల నుంచి మట్టి తవ్వుతూ, చెట్లు కొడుతున్నారని, ఆలయాల పనులు సాగిస్తూనే ఉన్నారని మరోసారి కొవ్వూరు ఆర్డీవోకు సోమవారం ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. కొండ చుట్టూ నివసిస్తున్న కొంతమందికి పట్టాలున్నాయని, మిగిలిన వారు పట్టాల కోసం రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నా తమ అభ్యర్థనను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా తమను పట్టించుకోకుండా వారికే మద్దతు తెలుపుతున్నారని విమర్శిస్తున్నారు. కొండ ప్రాంతంలో భూమి ఎంత ఉంది? ఎంత ఆక్రమణలకు గురైంది? అన్న విషయాలు తెలియాల్సి ఉంది. దీనిపై తహసీల్దార్ లక్ష్మి లావణ్యను వివరాణ కోరగా.. ఆ భూముల వివరాలు ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారని ఆమె చెప్పడానికి నిరాకరించడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.